క్లుప్తంగా

రేపు గురుకుల పాఠశాలలో ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

సింగరాయకొండ: స్థానిక బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో గురువారం ఉదయం 10 గంటలకు ఇంటర్మీడియెట్ సీఈసీ గ్రూపులో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కె.రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థినుల మెరిట్ ఆధారంగా అడ్మిషన్లు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఆసక్తి ఉన్న వారు ఈ ఏడాది పదో తరగతిలో సాధించిన ఒరిజినల్ మార్కుల లిస్టు, ఆధార్ కార్డు, ఇన్‌కం సర్టిఫికెట్, క్యాస్ట్ సర్టిఫికెట్స్‌తో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.

డిజిటల్ తరగతులపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న కాంప్లెక్స్ చైర్మన్ సురేష్‌బాబు

హనుమంతునిపాడు: విద్యా విధానంలో నూతనంగా వచ్చిన మార్పులకు అనుగుణంగా విద్యార్థులకు బోధన అందించాలని ఎంఈఓలు జి. పెద్దిరాజు, ఎస్.రమణయ్య, కాంప్లెక్స్ చైర్మన్ జీవీ.సురేష్‌బాబులు అన్నారు. హెచ్‌ఎంపాడు, చిన్నముప్పళ్లపాడు, నందనవనం కాంప్లెక్స్‌లో మంగళవారం కాంప్లెక్స్ తరగతులు నిర్వహించారు. మాట్లాడుతూ విద్యా విధానంలో వచ్చిన నూతన మార్పులతో అభ్యసన పద్ధతులు ఆధారంగా విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన అందించాలన్నారు. డిజిటల్ తరగతులపై ప్రతి విద్యార్థికి అవగాహన కల్పించాలని సూచించారు.

26వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలి

హనుమంతునిపాడు: వైఎస్సార్ వాహనమిత్ర, వైఎస్సార్ కాపునేస్తం పథకాలకు ఈ నెల 26 లోగా రెన్యువల్ చేసుకోవాలని ఎంపీడీఓ డి.ఈశ్వరమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు కొత్తగా కూడా పథకాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

అర్హులైన దివ్యాంగులకు రుణాలు

మర్రిపూడి: దివ్యాంగులకు ప్రభుత్వం రుణాలు మంజూరు చేయనుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ బ్రహ్మయ్య మంగళవారం తెలిపారు. 18 నుంచి 60 ఏళ్లలోపు ఉండి 40 శాతం అంగవైకల్యం ఉన్న దివ్యాంగులకు నామమాత్రపు వడ్డీతో వాణిజ్య, వ్యాపార, సేవా రంగాల్లో జీవనోపాధి మెరుగుపరుచుకోవడానికి ప్రభుత్వం తోడ్పాటునందిస్తుందని చెప్పారు. మూడు నుంచి ఐదేళ్లలో 6 శాతం వడ్డీతో తిరిగి చెల్లించేలా రూ.50 వేల నుంచి రూ.5 లక్షల వరకు రుణం అందించనున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన దివ్యాంగులు నిర్ణీత దరఖాస్తును జిల్లా వెబ్‌సైట్ ఎస్‌ఏపీ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని ఆగస్టు 8 తేదీలోగా ఒంగోలులోని విభిన్నప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 08592 281310ను సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు: మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాద్రిపాలెం విద్యుత్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్‌కు అడ్డంగా ఉన్న చెట్లు తొలగించే కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ టీవీ నరసింహం తెలిపారు. పట్టణంలోని తానికొండవారి కొస్టాలు, మధురనగర్, వెంకటాద్రిపాలెం, వ్యవసాయ మార్కెట్, కోర్టు ప్రాంగణం, కనిగిరి రోడ్డు, బిలాల్‌నగర్, దూబగుంట, ప్రకాశం ఇంజినీరింగ్ ప్రాంతాల్లో ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

1536 పొగాకు బేళ్ల అమ్మకం

కందుకూరు: కందుకూరు పొగాకు వేలం కేంద్రాల్లో మంగళవారం జరిగిన పొగాకు వేలంలో 1536 బేళ్లు విక్రయించారు. వీటిలో కందుకూరు-1వ వేలం కేంద్రంలో 1077 బేళ్లు వేలానికి ఉంచగా 1011 బేళ్లు, కందుకూరు-2 వేలం కేంద్రంలో 600 బేళ్లను వేలానికి ఉంచగా 525 బేళ్లు అమ్ముడుపోయాయి. రెండు వేలం కేంద్రాల్లోనూ అత్యధిక ధర రూ.251లు లభించగా అత్యల్ప ధరలు వరుసగా రూ.160లు, రూ.150లు లభించాయి.

విద్యుత్ సమస్యలు తక్షణమే పరిష్కారం

సింగరాయకొండ: జరుగుమల్లి మండల కేంద్రంలోని విద్యుత్ సెక్షన్ కార్యాలయంలో మంగళవారం ఉదయం నిర్వహించిన అదాలత్‌లో వినియోగదారుల నుంచి 11 అర్జీలు వచ్చినట్లు ఆ శాఖ ఏఈ గుంజి హర్దీష్ తెలిపారు. వీటిలో 10 అర్జీలను వెంటనే పరిష్కరించినట్లు పేర్కొన్నారు. పైడిపాడు సర్పంచ్ నాగినేని భాస్కర్ గ్రామానికి లైన్‌మెన్‌ను నియమించాలని దరఖాస్తు చేశారని, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ అదాలత్‌లో విద్యుత్ శాఖ ఒంగోలు రెవెన్యూ ఏఓ పి.శ్రీనివాసులరెడ్డి, కందుకూరు ఏఏఓ జి వెంకట్రామయ్య, సింగరాయకొండ జేఏఓ కె.తిరుపతిరావు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అర్హులకు మేలు

● ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి

కందుకూరు: జగనన్న సురక్ష పథకం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరినీ గుర్తించి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేయడంతో పాటు సంక్షేమ పథకాలకు వారిని ఎంపిక చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. ఐఎస్‌రావు నగర్ సచివాలయంలో పరిధిలో మంగళవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నెల రోజులపాటు ఈ కార్యక్రమంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామని, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి ఆ కుటుంబ అవసరాలు, ప్రభుత్వపరంగా అందించాల్సిన సహాయంపై సర్వే చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యాలయాల చుట్టూ తిరిగే ఇబ్బంది లేకుండా, ఎలాంటి రుసుం చెల్లించకుండా ఆదాయ, కుల, జనన, మరణ, రేషన్‌కార్డు, మ్యుటేషన్, ఆధార్ వంటి సేవలు ఉచితంగా అందించనున్నట్లు పేర్కొన్నారు. ధ్రువీకరణ పత్రాలు నేరుగా వలంటీర్లు ఇంటికి వచ్చి అందిస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదలను ధనికులను చేయడమే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, 99 శాతం హామీలు అమలు చేశారని చెప్పారు. పట్టణంలో దాదాపు రూ.32 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ప్రతి వార్డులో పెద్ద ఎత్తున రోడ్లు, కాల్వల నిర్మాణాలు జరుగుతున్నాయని వివరించారు. దీనిలో భాగంగా 30వ వార్డులో దాదాపు రూ.3 కోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు వివరించారు. అనంతరం లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి పంపిణీ చేశారు. మున్సిపల్ డీఈ శ్రీరామ్మూర్తి, జేసీఎస్ కన్వీనర్ ముప్పవరపు కిశోర్, బీసీ సెల్ జిల్లా నాయకుడు జాజుల కోటేశ్వరరావు, సచివాలయ కన్వీనర్లు రావులకొల్లు బ్రహ్మానందం, బక్కమంతుల అశోక్, జాజుల సాయిలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు కొండూరి వసంతరావు, గణేశం గంగిరెడ్డి పాల్గొన్నారు.

ఉలవపాడు: జగనన్న సురక్షతో ఇంటి వద్దకే సేవలు అందుతున్నాయని ఎంపీడీఓ చెంచమ్మ, తహసీల్దార్ బ్రహ్మయ్య అన్నారు. మంగళవారం స్థానిక-2 సచివాలయం పరిధిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం ప్రజలకు ఎలాంటి సమస్య ఉన్నా వారి ఇంటి వద్దకు అధికారులు వెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటోందన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా ప్రజల వినతులను పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. సర్పంచ్ నాగలక్ష్మి, వ్యవసాయాధికారి తిరుమలజ్యోతి, మండల కోఆప్షన్ సభ్యుడు ఖాదర్ బాషా, జేసీఎస్ కన్వీనర్ ధన కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వలేటివారిపాలెం: రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగనన్న పాలన సాగిస్తున్నారని జెడ్పీటీసీ ఇంటూరి భారతి అన్నారు. మండలంలోని పోకూరు గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యాక్రమం ఎంపీడీఓ రఫీక్ అహ్మద్ అధ్వర్యంలో నిర్వహించారు. జెడ్పీటీసీ భారతి మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమం పథకాలు అందిస్తోందన్నారు. గతంలో ఏ సర్టిఫికెట్ పొందాలన్నా ప్రజలు రోజులు తరబడి కార్యాలయాలు చుట్టూ తిరగాల్సి వచ్చేదని, సురక్ష కార్యాక్రమం ద్వారా ఉచితంగా సర్టిఫికెట్లు అందిస్తున్నట్లు చెప్పారు. 1060 మందికి సర్టిఫికెట్లు అందజేసినట్లు ఆమె తెలిపారు. తహసీల్దార్ సుందరమ్మ, ఈఓఆర్‌డీ సుమంత్, ఆర్‌ఐ నరసయ్య, ఎంపీపీ మౌనిక, సచివాలయం సిబ్బంది, వలంటీరులు పాల్గొన్నారు.

గుడ్లూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష పథకం ద్వారా 11 రకాల సేవలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించుకోవచ్చని ఎంపీపీ పులి రమేష్ అన్నారు. మండలంలోని నాయుడుపాలెంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. అనంతరం సచివాలయ పరిధిలోని నాయుడుపాలెం, మొగుళ్లూరు గ్రామాలకు చెందిన 586 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లు అందజేశారు. ఎంపీడీఓ చంద్రసేన్, తహసీల్దార్ సూర్యనారాయణసింగ్, ఏఓ రవికుమార్, సర్పంచ్‌లు గంగవరపు సుజాత నాగేశ్వరరావు, సూరే పద్మావతి కొండారెడ్డి, కార్యదర్శి టి.జగన్ పాల్గొన్నారు.



ఉలవపాడు: సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



గుడ్లూరు: నాయుడుపాలెంలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీపీ రమేష్



వలేటివారిపాలెం: ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

కందుకూరు రూరల్: విద్యార్థి దశలోనే రోడ్డు భద్రత నిబంధనల పట్ల అవగాహన పెంచుకుని ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఎంవీఐ ఎండీ రఫీ అన్నారు. మంగళవారం స్థానిక టీఆర్ఆర్ జూనియర్ కాలేజీలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. మితిమీరిన వేగం, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వల్ల ఎక్కువగా 18 నుంచి 30 ఏళ్ల యువత అధికంగా ప్రమాదాల బారిన పడుతున్నట్లు గుర్తించామన్నారు. 18 ఏళ్లు నిండి లైసెన్స్ పొందిన వారు మాత్రమే వాహనాలు నడపాలని చెప్పారు. వాహనాలకు నంబర్ ప్లేట్ సక్రమంగా ఉండాలని, సరైన ధ్రువ పత్రాలు అందుబాటులో ఉండాలని, ద్విచక్ర వాహనాలు నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్లు నడిపే వారు సీటు బెల్ట్ ధరిస్తే ప్రమాదం జరిగినప్పుడు ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చని చెప్పారు. ప్రతి విద్యార్థి ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన పెంచుకుని వాహనాలు నడపాలని సూచించారు. కాలేజీ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో వైఎస్సార్ కంటి పరీక్షలు

లింగసముద్రం: డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు ఫేస్-3 కార్యక్రమంలో భాగంగా మండలంలోని వీఆర్ కోట, అన్నెబోయినపల్లె గ్రామాల్లో కంటి వైద్య నిపుణులు 60 ఏళ్లపైబడిన వారికి మంగళవారం కంటి పరీక్షలు చేశారు. అన్నెబోయినపల్లెలో 74 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 27 మందికి కళ్లద్దాలు అవసరమని చెప్పారు. ఆరుగురికి కంటి ఆపరేషన్ చేయాలని చెప్పారు. వీఆర్ కోటలో 102 మందికి కంటి పరీక్షలు చేశారు. 81 మందికి కళ్లద్దాలు, 11 మందికి ఆపరేషన్ చేయాలని చెప్పారు. త్వరలో వీరికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించి కళ్లద్దాలు పంపిణీ చేయనున్నట్లు వైద్యాధికారులు చెప్పారు. కంటి వైద్యులు డాక్టర్ కేవీ సుబ్బయ్య, ఎస్.కోటేశ్వరరావు, బి.గురవయ్య పాల్గొన్నారు.

హత్య కేసును విచారించిన డీఎస్పీ



హనుమంతురావు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న డీఎస్పీ రామచంద్ర

గుడ్లూరు: మండలంలోని పాజర్ల గ్రామంలో రెండు నెలల క్రితం జరిగిన హత్య కేసుపై స్థానిక పోలీసు స్టేషన్‌లో కందుకూరు డీఎస్పీ రామచంద్ర మంగళవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పాజర్ల గ్రామంలో రెండు నెలల క్రితం పాటి హనుమంతురావు, పాటి మహేష్‌లు అటవీ ప్రాంతంలో మద్యం తాగి గొడవ పడటంతో మహేష్ రాయితో హనుమంతురావును కొట్టడంతో అతడు మృతి చెందాడు. దీనిపై మహేష్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. ఈ కేసులో తమకు న్యాయం జరగలేదని హనుమంతురావు కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్ ఎదుట 10 రోజుల క్రితం ఆందోళన చేయడంతో న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇచ్చారు. ఆదివారం హనుమంతురావు కుటుంబ సభ్యులు కొందరు మహిళలను తీసుకొచ్చి పాజర్ల గ్రామంలో ఎస్టీ కాలనీలో ఉన్న భవానీ అనే మహిళకు హత్యకు సంబంధించిన విషయాలు తెలుసని ఆమెపై దాడి చేసి గాయపరిచారన్నారు. దాడి చేసిన వారిపై భవానీ ఫిర్యాదు చేయడంతో ఈ కేసుపై విచారణ చేశారు. హనుమంతురావు కుటుంబ సభ్యులతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఇద్దరు మహిళలు దురుసుగా ప్రవర్తించండంపై డీఎస్పీ వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. కారణం లేకుండా పోలీస్‌స్టేషన్ వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. సమస్యలు ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు విచారిస్తామని డీఎస్పీ రామచంద్ర పేర్కొన్నారు. ఆయన వెంట సీఐ సుబ్బారావు, ఎస్ఐ ప్రసాదరెడ్డి, వలేటివారిపాలెం ఎస్ఐ మహేంద్ర నాయక్ ఉన్నారు.

మొహర్రం వేడుకలు ప్రారంభం



పామూరులో చావిడిలో ముస్తాబై ఉన్న పీర్లు



చావిడిలో గ్రామోత్సవానికి సిద్ధమవుతున్న పీర్ల గుమ్మటం

పామూరు: హిందు, ముస్లింలు మతసామరస్యానికి ప్రతీకగా నిర్వహించుకునే పీర్లపండుగ (మొహర్రం) వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వారం రోజులపాటు జరిగే ఈ వేడుకలు ఈనెల 29వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ముజావర్‌లు తెలిపారు. ఈసందర్భంగా మంగళవారం ముజావర్‌లు పట్టణంలోని పూలమార్కెట్ సెంటర్, సీఎస్‌పురం రోడ్డు, కనిగిరిరోడ్డులలోని పీర్లచావిడి, దర్గాలను ప్రత్యేక విద్యుద్దీపాలతో సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు పీర్లను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మార్కెట్ సెంటర్‌లోని పీర్ల గుమ్మటంను గ్రామోత్సవం చేసేందుకు విశిష్ట అలంకరణతో సిద్ధం చేశారు. 26వ తేదీన చిన్న సరిగత్తు, 27న సందు, 28న పెద సరిగత్తు, 29న పీర్లు గుండప్రవేశం అనంతరం మధ్యాహ్నం పీర్ల జలప్రవేశంతో మొహర్రం వేడుకలు ముగుస్తాయని ముజావర్ ఖాజామొహిద్దీన్ తెలిపారు.

హనుమంతునిపాడు: మొహర్రం వేడుకల్లో భాగంగా చిన్న సరిగేత్తుకు హాజీపురం, హనుమంతునిపాడు, వాలిచర్ల, నందనవనం, వీరరాంపురం , జమాన్‌ఖాన్‌పల్లి, రామాయిపల్లి, తిమ్మారెడ్డిపల్లి, కొండారెడ్డిపల్లి, మహమ్మందాపురం గ్రామాల్లో పీర్లను దింపి పీర్లను అలంకరించి చావిడీలో సిద్ధంగా ఉంచారు. బుధవారం చిన్న సరిగత్తు వేడుకలకు పీర్లను సిద్ధం చేసి ఉంచారు. మహమ్మదాపురం పంచాయతీలోని రాజుగారిపల్లి ఎస్సీ కాలనీ నుంచి నూతనంగా తయారు చేయించిన పీరును మంగళవారం భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం నిర్వహిస్తూ నూతన పీరును పీర్ల చావిడికి తరలించారు. రాజుగారిపల్లి గ్రామానికి చెందిన గొట్టిముక్కల బాలయ్య కుమారుడు గొట్టిముక్కల పెద్దకాశయ్య, అన్నపూర్ణ దంపతులు మొక్కుబడితో నూతనంగా పీరును తయారు చేయించారు.



రాజుగారిపలిలో ఊరేగింపుగా తీసుకెళ్తున్న పీరు

బీఎల్వోలకు ఓటర్లు సహకరించాలి

కొండపి: ఓటర్ల వివరాల పరిశీలనకు బూత్ లెవెల్ అధికారులు నివాసాల వద్దకు వచ్చినప్పుడు వివరాలు తెలియజేసి సహకరించాలని ఈఆర్‌ఓ నారదముని కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీల నాయకులతో ఓటర్ల సర్వేపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఆర్‌ఓ మాట్లాడుతూ.. ఈ నెల 21 నుంచి గ్రామాల్లో బీఎల్వోలు సర్వే ప్రారంభించారని, వారికి సహకరించాలని సూచించారు. ఆగస్టు 21వ తేదీ వరకు సర్వే కొనసాగుతుందని తెలిపారు. ఆధార్‌కార్డు, ఓటరు గుర్తింపు కార్డు, దివ్యాంగులైతే డాక్టర్ సర్టిఫికెట్, 17 లేక 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు 10వ తరగతి మార్కుల జాబితా లేదా స్కూల్ సర్టిఫికెట్ తప్పనిసరిగా చూపించాలన్నారు. ప్రతి ఓటరు బీఎల్వో ఎదుట హాజరయ్యేలా అవగాహన కల్పించాలని రాజకీయ నేతలను కోరారు. 2024 జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండే వారు నూతన ఓటరుగా నమోదు చేసుకోవచ్చని చెప్పారు. ఇంట్లో ఎవరైనా మరణించినట్లయితే బీఎల్వోకు మరణ ధ్రువీకరణ పత్రం అందజేయాలని సూచించారు. ఓటరు జాబితాలో తప్పులు సరిచేసుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో కొండపి, మర్రిపూడి, పొన్నలూరు, జరుగుమల్లి, సింగరాయకొండ, టంగుటూరు మండలాల తహసీల్దార్లు పి.సింగారావు, క్రిష్టారావు, శ్రావణ్, ఉషారాణి, ఉష, సంజీవరావు, ఎలక్షన్ డీటీ నాగరాజు, వివిధ రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందడుగు వేయాలి



బహుమతులు అందజేస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందడుగు వేయాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం 39వ వార్షిక వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఉషారాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చైర్మన్ గఫార్ మాట్లాడుతూ ప్రభుత్వంవిద్యాభివృద్ధికి అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. నాడు- నేడుతో ప్రభుత్వ పాఠశాలలు సుందరంగా తీర్చుదిద్దుకున్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన, మెరుగైన విద్య లభిస్తోందన్నారు. అనంతరం వివిధ పోటీల్లోని విజేతలకు బహుమతులు అందచేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎ బాలకృష్ణ, డి. విజయకుమారి, బి. రమేష్‌బాబు, కె. శ్రీనివాసులు, నరేష్ రాజ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ ట్యాంకుకు మరమ్మతులు



దర్శిలోని కనిగిరి ఎస్ఎస్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న కమిషనర్, డీఈ

కనిగిరి రూరల్: నీటి ఎద్దడి నివారణలో భాగంగా కనిగిరి మున్సిపల్ అధికారులు ముందస్తు ప్రణాళిక చర్యలను చేపట్టారు. కనిగిరి పట్టణంలో తాగునీటికి సంబంధించి దర్శి ఉన్న ఎస్ఎస్ ట్యాంక్‌ను సాగర్ జలాలతో నింపేందుకు అధికారులు మంగళవారం చర్యలు చేపట్టారు. జిల్లాకు విడుదలైన నాగార్జునసాగర్ జలాలను కనిగిరికి చెందిన దర్శిలో ఉన్న ఎస్ఎస్ ట్యాంక్‌లో నింపేందుకు అవసరమైన మరమ్మతులను రూ.5 లక్షలతో చేపడుతున్నట్లు తెలిపారు. బుధవారం నుంచి వారం రోజుల పాటు సచివాలయ ఇంజినీరింగ్ సెక్రటరీలు, మున్సిపల్ మెకానిక్‌లు, విద్యుత్ సిబ్బంది అక్కడ పనిచేస్తారన్నారు. ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ ఆదేశానుసారం యుద్ధప్రాతిపతికన చర్యలు తీసుకున్నట్లు కమిషనర్ నారాయణరావు, డీఈఈ సుబ్రహ్మణ్యం, ఏఈ కోటేశ్వరరావులు వెల్లడించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి

● మర్రిపూడి ప్రత్యేకాధికారి ఉదయభాస్కర్



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి ఉదయభాస్కర్

మర్రిపూడి: ప్రభుత్వ పథకాలకు అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేందుకు అధికారులు కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి, డీఎస్‌ఓ ఎ.ఉదయభాస్కర్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలకు అర్హులైన వారిని ఇంటింటికీ వెళ్లి గుర్తించాలన్నారు. గ్రామాలల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో రక్తహీనతను నివారించాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో ఆపరేషన్‌లు జరిగేలా చూడాలని వైద్యాధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ చిన్నారుల ఎత్తు, బరువు చూస్తూ బలవర్థకమైన ఆహారం అందించాలన్నారు. జగనన్న లేఅవుట్స్‌లో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. పని అడిగిన ప్రతి ఒక్కరికీ జాబ్‌కార్డు మంజూరు చేసి పనికల్పించాలన్నారు. సచివాలయ పరిధిలో ప్రజల అర్జీలు పెండింగ్ ఉండరాదన్నారు. జగనన్న పాల వెల్లువ కేంద్రాల్లో పాలుపోసిన పశుపోషకులకు ప్రభుత్వం గిట్టుబాటు ధర ఇస్తోందనే విషయంపై రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ బ్రహ్మయ్య, పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె.సంగీత, పశువైద్యాధికారిణి శ్రావణి, ఏపీఎం బాబురావు, ఏపీఓ రాంబాబు, పీఆర్ ఏఈ జాలయ్య, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



ఇనిమెర్ల పాఠశాలలో పుస్తకాలను పరిశీలిస్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి

పామూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారి ప్రైవేట్ పాఠశాలలను దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పనిచేస్తున్నాయని ప్రభుత్వ పాఠశాలల బుక్స్ అండ్ స్టేషనరీ రాష్ట్ర డైరెక్టర్ కొండా రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇనిమెర్ల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం మధ్యాహ్నం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల పాఠ్యపుస్తకాలు, హాజరు రిజిష్టర్లను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథక మెనూను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠ్యాంశాల బోధనలో అవలంబించాల్సిన తీరుపై ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. పాఠశాలలో హాజరుశాతం పెంచాలన్నారు. అదేవిధంగా ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో మెలుగుతూ విద్యాభ్యాసం చేసేలా తీర్చిదిద్దాలన్నారు. ఈసందర్భంగా పాఠశాలలో వసతులను ఆయన పరిశీలించి పాఠశాలలోని విద్యార్థులకు విద్యాకానుక, అమ్మఒడి పథకాల లబ్ధిపై హెచ్‌ఎం అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం మన్నే హరనాథరెడ్డి, మేకల శ్రీనివాసులు, షేక్.ఖాజామొహిద్దీన్, సిద్ధమూర్తి లక్ష్మిరెడ్డి ఉన్నారు.

నర్సరీల్లో మొక్కల పరిశీలన



మొక్కలు పరిశీలిస్తున్న ఏపీడీ సంజీవరావు

గుడ్లూరు: మండలంలోని పోట్లూరులో ఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో నర్సరీల్లో పెంచుతున్న వివిధ రకాల మొక్కలను డ్వామా ఏపీడీ సంజీవరావు మంగళవారం పరిశీలించారు. మొక్కల వివరాలు, వాటి రకాలు, ఎన్ని వందల మొక్కలు నర్సరీల్లో పెంచుతున్నారో సిబ్బందిని అడిగి ఏపీడీ తెలుసుకున్నారు. మొక్కలు ఎండి పోకుండా వాటిని రోజూ పర్యవేక్షిస్తూ అవసరమైన సమయాల్లో క్రమం తప్పకుండా నీరు పెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను వర్షాకాలంలో ప్రభుత్వ స్థలాలు, ప్రభుత్వ పాఠశాలల ఆవరణలు, ఖాళీ ప్రదేశాల్లో నాటి పెంచనున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట నర్సరీల కాంట్రాక్టర్ సాంబశివరాజు, ఫీల్డు అసిస్టెంట్ రాజు ఉన్నారు.

పట్టణ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

కనిగిరి రూరల్: పట్టణ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక 14వ వార్డులో సమస్య పరిష్కారం కార్యక్రమంలో భాగంగా మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ దశల వారీగా అన్ని వార్డులో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. తక్షణ చర్యగా రోడ్డు మరమ్మతు చర్యలు చేపట్టారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. కౌన్సిలర్ సత్యావతి, ఏఎంసీ డైరక్టర్ బాదం సత్యన్నారాయణ, నాయకులు నరసింహా, చోప్పరపు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ దోషులను శిక్షించి శాంతి నెలకొల్పాలి

పామూరు: మణిపూర్‌లో అఘాయిత్యాలను నిలువరించి తద్వారా శాంతిని నెలకొల్పడంతో పాటు దోషులకు ఉరిశిక్ష విధించాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్థానిక వైఎస్సార్ సెంటర్‌లో మంగళవారం సాయంత్రం ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకుడు కొమ్మలపాటి మాల్యాద్రి మాట్లాడుతూ మణిపూర్‌లో నెలల తరబడి అఘాయిత్యాలు, నిరసనలు జరుగుతున్నా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. మణిపూర్ ఘటనపై తక్షణ చర్యలు తీసుకోవాలని లేకపోతే నిరసన కార్యక్రమాలను తీవ్రతరం చేస్తామన్నారు. అల్లాబక్షు, ఐద్వానాయకురాలు షమ్మి, శంకర్, మస్తాన్ పలువురు పాల్గొన్నారు.